లుఖ్మాన్ (అలైహిస్సలాం) ఉపదేశాలు: జీవన విద్య – హబీబుర్ రహ్మాన్ జామిఈ (హాఫిజహుల్లాహ్)

teluguislam.net చే — జూన్ 12, 2026

లుఖ్మాన్ (అలైహిస్సలాం) ఉపదేశాలు: జీవన విద్య
తెలుగుఇస్లాం.నెట్ (teluguislam.net)

ఇక్కడ చూడండి

లుఖ్మాన్ (అలైహిస్సలాం) ఉపదేశాలు: జీవన విద్య

హబీబుర్ రహ్మాన్ జామిఈ (హాఫిజహుల్లాహ్)

https://youtu.be/H-0-b8o_u2M [30 నిముషాలు]

ఈ ప్రసంగంలో సురయే లుఖ్మాన్ ఆధారంగా 'జీవన విద్య' గురించి వివరించారు. లుఖ్మాన్ అలైహిస్సలాం తన కుమారునికి ఇచ్చిన ఎనిమిది ముఖ్యమైన ఉపదేశాలను ఈ క్రింది విధంగా చర్చించారు: అల్లాహ్ పట్ల ఏకత్వాన్ని కలిగి ఉండటం (తౌహీద్), తల్లిదండ్రుల పట్ల గౌరవం మరియు విధేయత చూపడం, అల్లాహ్ యొక్క సర్వవ్యాప్త జ్ఞానాన్ని గుర్తించి తఖ్వాతో జీవించడం, నమాజును నిలబెట్టడం, సమాజంలో మంచిని ప్రబోధించి చెడును నిరోధించడం, కష్ట సమయాల్లో సహనం (సబర్) పాటించడం, అహంకారాన్ని వీడి వినయాన్ని అలవరచుకోవడం మరియు మాట తీరులో, నడకలో మర్యాదను పాటించడం. చివరగా ఈ ఐదు సూత్రాలు—తౌహీద్, నమాజ్, అఖ్లాక్, సబర్, వినయం—మానవ

జీవితానికి మరియు సమాజ శ్రేయస్సుకు పునాదులని ఆయన సారాంశం ఇచ్చారు.

అస్సలాము అలైకుం వ రహ్మాతుల్లాహి వ బరకాతుహు.

إِنَّ الْحَمْدَ لِلهِ ، نَحْمَدُهُ وَنَسْتَعِينُهُ وَنَسْتَغْفِرُهُ ، وَنَعُوذُ بِاللهِ مِنْ شُرُورِ أَنْفُسِنَا ، وَمِنْ سَيِّئَاتِ أَعْمَالِنَا ، مَنْ يَهْدِهِ اللهُ فَلَا مُضِلَّ لَهُ ، وَمَنْ يُضْلِلْ فَلَا هَادِيَ لَهُ ، وَأَشْهَدُ أَنْ لَا إِلَهَ إِلَّا اللهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ ، وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ.

(ఇన్నల్ హమ్దులిల్లాహి నహ్మాదుహు వ నస్తయీనుహు వ నస్తగ్ఫిరుహు, వ నవూజ బిల్లాహి మిన్ షురూరి అన్ఫుసినా, వ మిన్ సయ్యిఆతి ఆ'మాలినా, మన్ యహదిహిల్లాహు ఫలా ముజిల్ల లహు, వ మన్ యుజ్లిల్ ఫలా హాదియ లహు, వ అష్హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహు లా షరీక లహు, వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహు వ రసూలుహు.)

అల్లాహుమ్మ సల్లి వసల్లిమ్ వ బారిక్ అలా అబ్దిక వ రసూలిక ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వ అలా ఆలిహి వ సహ్బిహి అజ్మయీన్.

సర్వ స్తోత్రాలు, అన్ని విధాల పొగడ్తలు, సకల ప్రశంసలు సర్వలోక ప్రభువైన అల్లాహ్ కే శోభిస్తాయి. అనంత కరుణా శుభాలు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై, ఆయన కుటుంబీకులపై, ఆయన ప్రియ సహచరులపై అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా తన అనుగ్రహాలను కురిపించు గాక.

లుఖ్మాన్ అలైహిస్సలాం ఉపదేశాలు: జీవన విద్య

అభిమాన సోదరులారా! ఈ రోజు మనం పరిశీలించబోయే విషయం: లుఖ్మాన్ అలైహిస్సలాం ఉపదేశాలు – జీవన విద్య. మన జీవితాన్ని సన్మార్గంలో నడిపించే అమూల్యమైన మార్గదర్శకత్వం లుఖ్మాన్ అలైహిస్సలాం వారి ఉపదేశాలలో ఉంది. ఖురాన్ లో ఒక సూరా పేరే ‘లుఖ్మాన్’. ఇందులో అల్లాహ్ సుబ్ హానహు వ త’ఆలా లుఖ్మాన్ అలైహిస్సలాం తన కుమారునికి ఇచ్చిన ఉపదేశాలను పేర్కొన్నాడు. కానీ ఆ ఉపదేశాలు కేవలం ఒక తండ్రి సలహాలు కాదు, ఇవి సమగ్ర జీవన విద్య.

1. తౌహీద్ మరియు షిర్క్ ఖండన

అన్నిటికంటే ముఖ్యమైనది తౌహీద్. ఇస్లాం యొక్క మొదటి మరియు అత్యంత ముఖ్యమైన బోధన తౌహీద్. ఇదే విషయం ముస్లిములు మరియు ముష్రికుల మధ్య స్పష్టమైన తేడాను ఏర్పరుస్తుంది. దీనిని నిరాకరించే వ్యక్తి ముష్రిక్ అవుతాడు. అలాంటి వ్యక్తికి లోకంలోనూ, పరలోకంలోనూ అవమానం మరియు అపకీర్తి తప్పదు. ఎందుకంటే షిర్క్ చేయడం అంటే ఒకే ఒక్క దేవుడైన అల్లాహ్ కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడం, ఆయన అస్తిత్వాన్ని నిరాకరించడం అవుతుంది. మరోవైపు షిర్క్ చేసే వ్యక్తి తనలాంటి లేదా తనకంటే తక్కువ స్థాయిలో ఉన్న సృష్టుల ముందు తల వంచి, తనను తాను అవమానించుకుంటాడు మరియు హీన స్థితికి దిగజారుతాడు.

లుఖ్మాన్ అలైహిస్సలాం తన కుమారునికి ఇచ్చిన మొదటి హితబోధ, మొదటి నసీహత్ ఇదే తౌహీద్ గురించి, షిర్క్ ఖండన గురించి:

وَإِذْ قَالَ لُقْمَانُ لِابْنِهِ وَهُوَ يَعِظُهُ يَا بُنَيَّ لَا تُشْرِكْ بِاللَّهِ ۖ إِنَّ الشِّرْكَ لَظُلْمٌ عَظِيمٌ
(వ ఇజ్ కాల లుఖ్మాను లిబ్నిహీ వహువ యఇజుహు యా బునయ్య లా తుష్రిక్ బిల్లాహి ఇన్నష్షిర్క లజుల్మున్ అజీమ్)

లుఖ్మాన్ తన కుమారునికి హితబోధ చేస్తూ ఇలా అన్నాడు: "ఓ నా ముద్దుల పుత్రుడా! అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించకు. నిస్సందేహంగా అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించటం (షిర్క్ చేయటం) ఘోరమైన అన్యాయం."(31:13)

లుఖ్మాన్ అలైహిస్సలాం తన కుమారునికి చేసిన మొట్టమొదట ఉపదేశం షిర్క్ నుండి వారించడం. దీనిని బట్టి విదితమయ్యేదేమిటంటే, తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎప్పుడు హితోపదేశం చేసినా ప్రధాన స్థానంలో షిర్క్ ఖండన, తౌహీద్ అంగీకారం గురించే అయి ఉండాలి. షిర్క్ నుండి వారించే మాటలు తప్పకుండా చెప్పాలి. తమ పిల్లలలో అల్లాహ్ ఏకత్వాన్ని నూరిపోయాలి.

జీవన విద్యలో మొదటి పాఠం తౌహీద్. ఇది మనం బాగా తెలుసుకోవాలి. విశ్వాసం సరిగ్గా ఉంటే జీవితం సరిగ్గా ఉంటుంది. మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారు: "**ఎవరైతే షిర్క్ చేయకుండా చనిపోతారో వారు స్వర్గంలో ప్రవేశిస్తారు**." అందుకే మనము చదివే, పఠించే కలిమా – 'కలిమతుత్ తౌహీద్' – లా ఇలాహ ఇల్లల్లాహ్ లో మొదటి భాగం ఏమిటి? షిర్క్ ఖండన. రెండవ భాగం తౌహీద్ అంగీకారం ఉంటుంది. నఫీ – ఇస్ బాత్. లా ఇలాహ (దేవుడు లేడు), ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప). అంటే మొదటి భాగం ఏమి ఉంది? షిర్క్ ఖండన ఉంది. రెండవ భాగంలో తౌహీద్ అంగీకారం గురించి ఉంటుంది.

కావున లుఖ్మాన్ అలైహిస్సలాం తన కుమారునికి బోధించిన మొదటి విషయం, నసీహత్ చేసిన మొదటి నసీహత్ అది తౌహీద్ గురించి, షిర్క్ ఖండన గురించి ఉంది. ఎందుకంటే ఇది జీవితంలో అన్నిటికంటే ప్రధానమైనది, అన్నిటికంటే ముఖ్యమైనది. దీనికి మించినది ఏదీ లేదు.

2. తల్లిదండ్రుల గౌరవం

ఇక రెండో విషయానికి వస్తే, తౌహీద్ తర్వాత అమ్మ నాన్న గురించి ఉంటుంది, తల్లిదండ్రుల గురించి ఉంటుంది. ఇస్లాం ధర్మంలో తల్లిదండ్రుల గౌరవానికి అత్యున్నత స్థానం ఉంది. అల్లాహ్ ఆరాధన తర్వాత వెంటనే తల్లిదండ్రుల పట్ల దయ, విధేయతను ఖురాన్ ఆదేశిస్తుంది. లుఖ్మాన్ సూరాలో, ఆయత్ 14 లో ఇలా ఉంటుంది:

وَوَصَّيْنَا الْإِنْسَانَ بِوَالِدَيْهِ حَمَلَتْهُ أُمُّهُ وَهْنًا عَلَىٰ وَهْنٍ وَفِصَالُهُ فِي عَامَيْنِ أَنِ اشْكُرْ لِي وَلِوَالِدَيْكَ إِلَيَّ الْمَصِيرُ

(వ వస్సైనల్ ఇన్ సాన బివాలిదైహి హమలత్ హు ఉమ్ముహు వహ్నన్ అలా వహ్నిన్ వ ఫిసాలుహు ఫీ ఆమైని అనిష్కుర్ లీ వ లివాలిదైక ఇలయ్యల్ మసీర్)

మరి మేము మానవునికి అతని తల్లిదండ్రుల విషయంలో గట్టిగా తాకీదు చేశాము- అతని తల్లి అతన్ని ప్రయాసపై ప్రయాసకు ఓర్చుకుంటూ తన గర్భంలో మోసింది. మరి అతని పాలను విడిపించటానికి రెండు సంవత్సరాలు పట్టింది. (కనుక ఓ మానవుడా!) నువ్వు నాకూ, నీ తల్లిదండ్రులకూ కృతజ్ఞుడవై ఉండు. (ఎట్టకేలకు మీరంతా) మరలి రావలసింది నా వద్దకే.(31:14)

ఈ ఆయతులు తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత, సహనం, దయ చూపాలని స్పష్టంగా బోధిస్తాయి.

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారు: "**అల్లాహ్ సంతృప్తి తల్లిదండ్రుల సంతృప్తిలో ఉంది. అల్లాహ్ అసంతృప్తి**

తల్లిదండ్రుల అసంతృప్తిలో ఉంది."

ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ని అడిగాడు: "**నా మంచి సహవాసానికి ఎవరు ఎక్కువ అర్హులు?**" మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్పారు: "**నీ తల్లి**". అతను మూడు సార్లు అడిగితే, మూడు సార్లు కూడా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) "నీ తల్లి" అని చెప్పారు. నాలుగవ సారి "**నీ తండ్రి**" అని సమాధానం ఇచ్చారు.

అంటే తల్లిదండ్రులను ఎలా గౌరవించాలి, వారితో మృదువుగా మాట్లాడాలి, వారి అవసరాలు తీర్చాలి, వారి కోసం దుఆ చేయాలి. ఈ విధంగా రెండవ విషయం లుఖ్మాన్ అలైహిస్సలాం తన కుమారునికి చేసింది అది తల్లిదండ్రుల గురించి.

ఖురాన్ మరియు హదీసు ప్రకారం తల్లిదండ్రుల గౌరవం ఒక మహత్తర ఇబాదత్. వారిని సంతోషపరచడం ద్వారా అల్లాహ్ సంతోషాన్ని పొందవచ్చు. అందుకే ప్రతి ముస్లిం తన తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం, విధేయతతో ఉండాలి. ఇది రెండవ విషయం. లుఖ్మాన్ అలైహిస్సలాం యొక్క ఉపదేశాల విషయంలో 'వ వస్సైనల్ ఇన్ సాన బివాలిదైహి' అని ఉంటుంది.

మొదటిది ఏంటి? తౌహీద్, నమ్మకం, విధేయత, ఆజ్ఞాపాలన. రెండవది ఏమిటి? తల్లిదండ్రుల గురించి. అంటే తల్లి కష్టాలు, తండ్రి పోషణ – ఇది మనకు ఏమి నేర్పుతుంది? కుటుంబ విలువలు సమాజానికి పునాది.

3. అల్లాహ్ సర్వజ్ఞుడు & బాధ్యతా భావం (తఖ్వా)

ఇక మూడవ విషయానికి వస్తే, అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా సర్వజ్ఞుడు. బాధ్యతా భావం కలుగుతుంది దీనివల్ల. అంటే లుఖ్మాన్ అలైహిస్సలాం చేసిన మూడవ హితోపదేశం:

يَا بُنَيَّ إِنَّهَا إِن تَكُ مِثْقَالَ حَبَّةٍ مِّنْ خَرْدَلٍ فَتَكُن فِي صَخْرَةٍ أَوْ فِي السَّمَاوَاتِ أَوْ فِي الْأَرْضِ يَأْتِ بِهَا اللَّهُ ۚ إِنَّ اللَّهَ لَطِيفٌ خَبِيرٌ

(యా బునయ్య ఇన్నహా ఇన్ తకు మిస్ ఖాల హబ్బతిమ్ మిన్ ఖర్దలిన్ ఫతకున్ ఫీ సఖ్రతిన్ అవ్ ఫిస్ సమావాతి అవ్ ఫిల్ అర్జి యాతి బిహల్లాహు ఇన్నల్లాహ లతీఫున్ ఖబీర్)

(లుఖ్మాన్ తన కుమారునికి ఇలా బోధపరిచాడు) **"నాయనా! ఏదైనా వస్తువు ఆవగింజంత ఉన్నా, అది ఏదైనా రాతి బండలో ఉన్నా, లేక అది ఆకాశాలలో ఉన్నా లేదా భూమిలో ఉన్నా దాన్ని అల్లాహ్ తప్పకుండా తీసుకువస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ సూక్ష్మ విషయాలను ఎరిగినవాడు, అన్నీ తెలిసినవాడు.** (31:16)

అంటే ఒక ఆవగింజంత పని అయినా అల్లాహ్ గమనిస్తాడు. రహస్య జీవితంలో కూడా తఖ్వా కలిగి ఉండాలి అన్న మాట. సమాజంలో ఉన్నా, సమూహంలో ఉన్నా, ఇంట్లో ఉన్నా, బయట ఉన్నా, ఏకాంతంలో ఉన్నా ఎలాగైనా సరే, రాత్రి పగలు ఎక్కడైనా సరే అల్లాహ్ గమనిస్తున్నాడు. ఏదీ కూడా అల్లాహ్ తో గోప్యంగా లేదు. ప్రతి విషయం అల్లాహ్ కు తెలుసు. రహస్య జీవితంలో కూడా తఖ్వా కలిగి ఉండాలి అని బోధపడుతుంది మనకు.

ఈ కాలంలో ఒంటరిగా ఉన్నప్పుడు ఎక్కువగా ఉపయోగించేది మొబైల్. కావున అల్లాహ్ చూస్తున్నాడని గుర్తుంచుకోవాలి. హరామ్ కంటెంట్ చూడకూడదు,

చెడు చాటింగ్ చేయకూడదు, చెడు సంబంధాలు నివారించాలి. రహస్యంగా చేసిన పాపం కూడా అల్లాహ్ కు చాలా బాగా తెలుసు. ఇది మనలో తఖ్వా పెంచుతుంది ఈ భావన. ఈ హితోపదేశం ఆవగింజంత కూడా అల్లాహ్ కు తెలుసు అంటే నేను ఏది చేసినా, నేను ఏది ఊహించినా అల్లాహ్ ఎరుగుతాడు. అన్ని విషయాలు అల్లాహ్ కు తెలుసు. కావున ఈ భావన కలిగి ఉంటే ఏమవుతుంది? తఖ్వా పెరుగుతుంది, దైవభీతి పెరుగుతుంది.

4. నమాజు స్థాపన

ఇక నాలుగవ ఉపదేశం లుఖ్మాన్ అలైహిస్సలాం తన కుమారునికి చేసిన ఉపదేశం నాలుగవది: నమాజ్ స్థాపన.

يَا بُنَيَّ أَقِمِ الصَّلَاةَ...
(యా బునయ్య అఖిమిస్ సలాత...)

“ఓ నా కుమారా! నమాజును స్థాపించు...” (31:17)

ఇస్లాం ధర్మంలో సలాహ్ (నమాజు) అత్యంత ముఖ్యమైన ఇబాదత్. ఇది ఇస్లాం యొక్క ఐదు స్తంభాలలో ఒక స్తంభం. అర్కానుల్ ఇస్లాం లోని ఒక రుకున్. అల్లాహ్ పై విశ్వాసం తర్వాత అత్యంత ప్రధానమైన కర్తవ్యం అస్సలాహ్.

నమాజ్ గురించి ఖురాన్ లో అనేక చోట్ల ప్రస్తావించబడింది. “**నమాజ్ ను స్థాపించండి, జకాత్ ఇవ్వండి**” – సూరయే బఖరాలో, సూరయే అన్కబూత్ లో, సూరయే తాహాలో అనేక సూరాలలో ఉంది. నమాజ్ అసభ్య కార్యాల నుండి, చెడు పనుల నుండి నివారిస్తుంది. అంటే ఈ ఆయత్ కి చాలా వివరంగా చెప్పవచ్చు – ‘ఇన్నస్ సలాత తన్ హా అనిల్ ఫహ్ షాయి వల్ మున్ కర్’.

నమాజ్, నమాజ్ చేసే వ్యక్తిని చెడు పని నుండి, పాపం నుండి, ఫహ్ షా నుండి, మున్ కర్ నుండి కాపాడుతుంది అని ఇది ఖురాన్ వాక్యం, ఖురాన్ ఆయత్. మరి ఇప్పుడు మనం సమాజంలో గమనిస్తున్నాము – నమాజులు చేస్తున్నాము, పాపాలు చేస్తున్నాము. నమాజులు చేస్తున్నాము, సినిమాలు చూస్తున్నాము. నమాజ్ చేస్తున్నాము, బూతులు మాట్లాడుతున్నాము. నమాజ్ చేస్తున్నారు, మోసాలు చేస్తున్నారు. నమాజులు చేస్తున్నారు, అనేక పాపాలకి పాల్పడుతున్నారు. అంటే మరి అల్లాహ్ వాగ్దానం కదా అది ఖురాన్ లో, ఆయత్ లో ఉంది కదా! ప్రతి ప్రవక్త నమాజ్ గురించి హెచ్చరించారు. మన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రాణం పోయే ఆ సమయంలో కూడా 'అస్సలాత్ అస్సలాత్' అని చెప్పారు. మరి ఇటువంటి నమాజ్ మరి నమాజ్ చేసే వ్యక్తిని పాపాల నుండి, దుర్మార్గాల నుండి, మోసాల నుండి, చెడు నుండి ఎందుకు కాపాడటం లేదు అంటే – **నమాజ్ చేసే రీతిలో, ఏ విధానంలో నమాజ్ చేయాలో, ఏ హక్కులతో నమాజ్ చేయాలో, ఏ రీతిలో నమాజ్ చేయాలో, ఏ భక్తితో, ఏ భావనతో నమాజ్ చేయాలో, ఎటువంటి విశ్వాసంతో నమాజ్ చేయాలో, ఏ విధానంతో నమాజ్ చేయాలో ఆ విధానం లేదు కాబట్టి.** "నన్ను స్మరించుటకై నమాజ్ స్థాపించు". ఈ ఆయతులు నమాజ్ మనిషిని పాపాల నుండి దూరంగా ఉంచి అల్లాహ్ స్మరణలో ఉంచుతుందని తెలియజేస్తాయి.

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా నమాజ్ గురించి అనేక సందర్భాలలో అనేక విధాలుగా తెలియజేసి ఉన్నారు. "**మన మధ్య మరియు కుఫ్ర్ మధ్య తేడా అనేది నమాజ్**." రేపు ప్రళయ దినాన మనిషి నుండి మొదట అడగబడేది నమాజ్ గురించే.

ఈ విధంగా నమాజ్ గురించి చాలా విషయాలు ఉన్నాయి. నమాజ్ వల్ల కలిగే ప్రయోజనాలలో అల్లాహ్ కు దగ్గరవ్వడం, హృదయానికి శాంతి, పాపాల

క్షమాపణ, క్రమశిక్షణ మరియు సమయపాలన, సమాజంలో ఐక్యత (జమాత్ నమాజ్ ద్వారా). ఈ విధంగా నమాజ్ గురించి చాలా విషయాలు ఉన్నాయి. ఖురాన్ మరియు హదీసు ప్రకారం నమాజ్ ముస్లిముల జీవితానికి ఆధారం. ఇది కేవలం ఆచారం కాదు, ఇది అల్లాహ్ తో నేరుగా సంబంధాన్ని బలపరిచే పవిత్రమైన మార్గం. ఇది మనం బాగా అర్థం చేసుకోవాలి. **నమాజ్ అనేది కేవలం ఆచారం కాదు**. ఇది అల్లాహ్ తో నేరుగా సంబంధాన్ని బలపరిచే పవిత్రమైన మార్గం. క్రమంగా ఖుషూ (భక్తి), వినయంతో నమాజ్ ఆచరించడం ద్వారా ఈ లోకంలో శాంతి, పరలోకంలో విజయం లభిస్తాయి.

5. మంచిని ఆదేశించడం, చెడును నిరోధించడం

ఇక ఐదవ హితోపదేశం: మంచి ఆజ్ఞాపన, చెడు నిరోధం – అమర్ బిల్ మారూఫ్ వ నహీ అనిల్ మున్ కర్. మంచిని పెంపొందించడం, చెడును నిర్మూలించడం.

...وَأْمُرْ بِالْمَعْرُوفِ وَانْهَ عَنِ الْمُنكَرِ...
(...వ మురి బిల్ మ'రూఫి వన్ హ అనిల్ మున్కరి...)

"...మంచిని ఆదేశించు, చెడును వారించు..." (31:17)

అంటే సమాజ బాధ్యత అని అర్థం దీనికి. సమాజ బాధ్యత ప్రతి ముస్లింకి ఉంది. అమర్ బిల్ మారూఫ్ వ నహీ అనిల్ మున్ కర్ వలన ఏం జరుగుతుంది? సమాజంలో న్యాయం జరుగుతుంది, సమాజంలో శాంతి ఉంటుంది, సమాజంలో సమానత్వం ఉంటుంది.

ఇస్లాం ధర్మంలో వ్యక్తిగత భక్తితో పాటు **సామాజిక బాధ్యత, సమాజం పట్ల కర్తవ్యం** కూడా అత్యంత ముఖ్యమైనది. ముస్లిం కేవలం తన కోసం మాత్రమే

కాకుండా సమాజ మేలు కోసం జీవించాలని ఖురాన్ మరియు హదీసులు బోధిస్తాయి.

ఖురాన్ లో సూరయే మాయిదాలో ఉంది: "**నీతి, భయభక్తుల విషయాల్లో పరస్పరం సహకరించండి. పాపం, దుర్మార్గంలో సహకరించవద్దండి.**" 'తఆవనూ అలల్ బిర్రి వత్ తఖ్వా, వ లా తఆవనూ అలల్ ఇస్మి వల్ ఉద్వాన్'. మంచి విషయాలలో, పుణ్యానికి సంబంధించిన విషయాలలో, సత్కార్యాలలో ఒకరికొకరు సహాయంగా, తోడుగా ఉండాలి. పాపంతో కూడిన విషయాలలో సహాయం చేయకూడదు. ఈ విధంగా నిజమైన నీతి అనేది తన సంపదను బంధువులకు, అనాధలకు, నిరుపేదలకు ఇవ్వడం. అలాగే సూరయే ఆలి ఇమ్రాన్ లో ఉంటుంది: "**మీరు ఉత్తమ సమాజం, మీరు మంచి పనులను ఆజ్ఞాపించి చెడు పనులను నిరోధిస్తారు**." ఈ ఆయతులు సమాజంలో న్యాయం, దయ, సహాయం, ధర్మం స్థాపించాల్సిన బాధ్యతను గుర్తు చేస్తాయి.

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేశారు: "**మీలో ఎవరికైనా తన సోదరుడికి ఇష్టమైనదే తనకూ ఇష్టమైతే అతడు నిజమైన విశ్వాసి**." తన కోసం ఏది ఇష్టపడతాడో, సోదరుని కోసం కూడా అదే ఇష్టపడాలి. అటువంటి వ్యక్తే నిజమైన విశ్వాసి.

ప్రజలకు అత్యంత మేలు చేసేవారే ఉత్తములు. ఇంకా మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "**ఎవరు చెడు చూడగలిగితే దానిని చేతితో ఆపాలి. సాధ్యం కాకపోతే మాటతో ఆపాలి. ఇది కూడా సాధ్యం కాకపోతే హృదయంలో అసహ్యించుకోవాలి. ఇది ఈమాన్ లో అత్యంత బలహీనమైన స్థాయి**."

ముస్లిముల సామాజిక కర్తవ్యాలలో జకాత్, సదఖా ఇవ్వడం, పేదలు, అనాథలు, వితంతువులకు సహాయం చేయడం, నిజాయితీతో వ్యాపారం చేయడం, పొరుగువారిని గౌరవించడం, అన్యాయాన్ని వ్యతిరేకించడం, సమాజంలో శాంతి ఐక్యత పెంపొందించడం. ఇవన్నీ అమర్ బిల్ మారూఫ్ వ నహీ అనిల్ మున్కర్ ద్వారా జరుగుతాయి. ఖురాన్ మరియు హదీసు ప్రకారం ప్రతి ముస్లిం వ్యక్తి సమాజానికి మేలు చేసే వ్యక్తిగా ఉండాలి. సమాజ సేవ కూడా ఒక ఇబాదత్. దయ, న్యాయం, సహకారం, సత్యం – ఇవే ఇస్లాం బోధించే సామాజిక బాధ్యతల మూల సూత్రాలు.

6. సహనం (సబర్)

ఇక ఆరవ ఉపదేశం: సబర్, సహనం.

...وَاصْبِرْ عَلَىٰ مَا أَصَابَكَ...
(...వస్ బిర్ అలా మా అసాబక...)

“...మరియు నీపై వచ్చి పడే (కష్టాలను) సహనంతో భరించు...” (31:17)

జీవితం అంటే సమస్యలు, కష్టాలు, బాధలు, రోగాలు, ఇష్టం లేని విషయాలు చాలా వస్తా ఉంటాయి. వాటిలో సహనం వహించాలి. పరీక్షలు ఉంటాయి. అల్లాహ్ సుబ్ హానహు వ త’ఆలా పాపాల మూలంగానో లేకపోతే పరీక్ష నిమిత్తమో పరీక్షిస్తాడు. పరీక్షలు అంటే జీవితంలో భాగమే అవి. సబర్ విజయానికి మార్గం. సహనం ఇస్లాం ధర్మంలో అత్యున్నత గుణాలలో ఒకటి. కష్టకాలంలో స్థిరంగా ఉండటం, పాపాల నుండి దూరంగా ఉండటం, అల్లాహ్ పై నమ్మకంతో ఉండటం ఇవన్నీ సబర్ లోని భాగాలు.

అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా ఖురాన్ లో ఇలా తెలియజేశాడు: "**ఓ విశ్వాసులారా! సహనం మరియు నమాజ్ ద్వారా సహాయం కోరండి. నిజంగా అల్లాహ్ సహనంతో ఉన్నవారితో ఉంటాడు**." ఇంకా సూరయే ఆలి ఇమ్రాన్ లో ఇలా ఉంటుంది: "**ఓ విశ్వాసులారా! సహనం పాటించండి, స్థిరంగా ఉండండి**." సూరయే జుమర్ లో ఉంటుంది: "**సహనం పాటించే వారి ప్రతిఫలం లెక్కలేనిది**."

ఈ ఆయతులు సబర్ ఉన్న వాడికి అల్లాహ్ ప్రత్యేకత ప్రతిఫలం ఇస్తాడని తెలియజేస్తున్నాయి. ఈ విధంగా సబర్ గురించి చాలా విషయాలు ఖురాన్ మరియు హదీసులో ఉన్నాయి. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేశారు: "**నిజమైన సహనం కష్టం మొదటి దెబ్బలోనే కనిపిస్తుంది**." అంటే సహనం యొక్క రకాలు అనేక రకాలుగా ఉంటాయి: ఆజ్ఞాపాలనలో సబర్ (ఇబాదత్ లో సబర్ – నమాజ్, ఉపవాసం వంటి ఇబాదత్ లో స్థిరంగా ఉండటం), పాపాల నుండి దూరంగా ఉండటంలో సబర్, అలాగే కష్టకాలంలో సహనం (అనారోగ్యం, నష్టం, పరీక్షలు వచ్చినప్పుడు అల్లాహ్ పై నమ్మకం కలిగి ఉండటం). ఖురాన్ మరియు హదీసు ప్రకారం సహనం ఒక విశ్వాసి యొక్క బలమైన ఆయుధం. సబర్ ద్వారా మనం అల్లాహ్ కు దగ్గరవుతాము, ఈ లోకంలో శాంతిని పరలోకంలో విజయాన్ని పొందుతాము.

7. వినయం మరియు అహంకార నిరాకరణ

ఇక ఏడవ ఉపదేశం: అహంకారం, దాన్ని విడిచిపెట్టడం.

...وَلَا تُصَعِّرْ خَدَّكَ لِلنَّاسِ وَلَا تَمْشِ فِي الْأَرْضِ مَرَحًا
(వ లా తుసఇ'ర్ ఖద్దక లిన్నాసి వ లా తమ్ షి ఫిల్ అర్జి మరహాన్...)

"జనుల ముందు (గర్వంతో) మొహం తిప్పుకొని మాట్లాడకు. భూమిపై నిక్కుతూ నడవకు..." (31:18)

ఓ నా కుమారా! అహంకారం – కిబ్ర్ – ఇస్లాం ధర్మంలో తీవ్రంగా నిషేధించబడిన దోషం. మనిషి తనను తాను గొప్పవాడిగా భావించి ఇతరులను తక్కువగా చూడటం ఇది అల్లాహ్ కు ఇష్టం లేని గుణం. వినయం మాత్రమే విశ్వాసి యొక్క లక్షణం. ప్రజల పట్ల నీ చెంపను తిప్పవద్దు, గర్వంగా చూడవద్దు, భూమిపై అహంకారంగా నడవవద్దు. అల్లాహ్ గర్విష్టులను ఇష్టపడడు అని లుఖ్మాన్ అలైహిస్సలాం బోధించిన విషయం ఇది.

ఇంకా వేరే చోట్ల ఉంది ఖురాన్ లో: "**నిస్సందేహంగా అల్లాహ్ అహంకారులను ఇష్టపడడు.**" ఇంకో చోట ఇలా ఉంది: "**భూమిపై అన్యాయంగా అహంకారం ప్రదర్శించే వారిని నా ఆయతుల నుండి తిప్పివేస్తాము**." ఈ ఆయతులు అహంకారం మనిషిని సత్యం నుండి దూరం చేస్తుందని స్పష్టం చేస్తాయి.

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా దీని గురించి అనేక సందర్భాలలో అనేక విషయాలు చెప్పారు. "**ఎవరి హృదయంలో ఆవగింజంత అహంకారం ఉన్నా అతడు స్వర్గంలో ప్రవేశించడు**." సహాబాలు అడిగారు: "ఓ ప్రవక్తా! ఒక మనిషి తన దుస్తులు చెప్పులు అందంగా ఉండాలని కోరుకోవడం కూడా అహంకారమేనా?" దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సమాధానం ఇచ్చారు: "**అల్లాహ్ సుందరుడు, సౌందర్యాన్ని ఇష్టపడతాడు. అహంకారం అనేది సత్యాన్ని తిరస్కరించడం మరియు ప్రజలను తక్కువగా చూడడం**." కావున అహంకారం వల్ల కలిగే నష్టాలలో ఒకటి సత్యాన్ని అంగీకరించకపోవడం, అలాగే ఇతరులను తక్కువగా చూడడం, సమాజంలో విభేదాలు ఏర్పరచడం. ఇవన్నీ అల్లాహ్ కోపానికి గురవడం అవుతుంది. దానికి విరుద్ధంగా కిబ్ర్ కి విరుద్ధంగా వినయం – వినయం ఉన్న వారిని అల్లాహ్ ఉన్నత

స్థాయికి చేరుస్తాడు. వినయం విశ్వాసిని ప్రజల హృదయాల్లో ప్రియంగా చేస్తుంది. ఇది ప్రవక్తల లక్షణం. ఖురాన్ మరియు హదీసు ప్రకారం అహంకారం ఒక ప్రమాదకరమైన పాపం. మనిషి తన సంపద, జ్ఞానం, స్థానం వల్ల గర్వపడకూడదు. అన్నీ అల్లాహ్ అనుగ్రహమే అని గుర్తించి వినయంతో జీవించడం నిజమైన విశ్వాసి లక్షణం.

8. మిత భాషణ మరియు మర్యాద

అలాగే ఎనిమిదవది: మిత భాషణ. మాట్లాడే తీరు, మాట్లాడే విధానం, బాడీ లాంగ్వేజ్.

وَاقْصِدْ فِي مَشْيِكَ وَاغْضُضْ مِن صَوْتِكَ ۚ إِنَّ أَنكَرَ الْأَصْوَاتِ لَصَوْتُ الْحَمِيرِ
(వక్ సిద్ ఫీ మష్ యిక వగ్ జుజ్ మిన్ సౌతిక ఇన్న అన్ కరల్ అస్వాతి లసౌతుల్ హమీర్)

“నీ నడకలో మధ్యేమార్గం అవలంబించు. నీ కంఠ స్వరాన్ని కాస్త తగ్గించు. నిశ్చయంగా స్వరాలన్నింటిలోకీ అత్యంత కఠోరమైనది గాడిదల స్వరం.” (31:19)

నడకలో మధ్యేమార్గం అవలంబించు. నీ కంఠ స్వరాన్ని కాస్త తగ్గించు. నిశ్చయంగా స్వరాలన్నింటిలోకి అత్యంత కఠోరమైనది గాడిద స్వరం. మిత భాషణ అంటే మన మాటల్లో నియంత్రణ, దయ, నిజాయితీ మరియు మర్యాదతో మాట్లాడటం. ఖురాన్ మరియు హదీసు ప్రకారం మాటల శక్తి సమాజంలో శాంతి మరియు ఐక్యతకు మూలం. నిజమైన ముస్లిం – మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్పిన మాట – **నిజమైన ముస్లిం వ్యక్తి తన చేతులతో మరియు తన భాషతో ఇతరులకు హాని చేయడు**. ‘అల్

ముస్లిము మన్ సలీమల్ ముస్లిమూన మిన్ లిసానిహి వ యదిహి'. ఒక ముస్లిం అనేవాడు తన చేతి ద్వారా, తన బిహేవియర్ ద్వారా, మాటల ద్వారా ఇతరులకు హాని కల్పించడు. అటువంటి వ్యక్తి అటువంటి వ్యక్తే నిజమైన ముస్లిం అని మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేశారు. అలాగే **సదా మంచి మాట చెప్పడం కూడా సదఖా**. మంచి మాట – అది కూడా సదఖా కిందకు వస్తుందని మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారు.

ఖురాన్ మరియు హదీసు ప్రకారం **మిత భాషణ** ఒక మహత్తర మానవ గుణం. మాటల ద్వారా హాని కలిగించకుండా సమాజంలో శాంతి మరియు ఐక్యతను కొనసాగించడం ప్రతి ముస్లిం యొక్క కర్తవ్యం. మంచి మాటలు వాడటం కూడా ఒక ఇబాదత్ మరియు అది మన వ్యక్తిత్వానికి మెరుగుపరుస్తుంది. అంటే బాడీ లాంగ్వేజ్ కూడా బాగుండాలి.

సారాంశం

అభిమాన సోదరులారా! ఈ విధంగా లుఖ్మాన్ అలైహిస్సలాం తన కుమారునికి చేసిన ఉపదేశాలు దానికి వివరంగా చెప్పుకుంటూ పోతే చాలా సమయం అవసరం పడుతుంది. క్లుప్తంగా దీని యొక్క సారాంశం లుఖ్మాన్ అలైహిస్సలాం తన కుమారునికి ఇచ్చిన ఉపదేశాలలోని సారాంశం ఐదు పదాలలో చెప్పాలంటే:

1. **తౌహీద్ (అల్లాహ్ పట్ల నమ్మకం, విధేయత, ఆజ్ఞాపాలన)**
2. **నమాజ్ (క్రమశిక్షణ)**
3. **అఖ్లాక్ (వ్యక్తిత్వం)**
4. **సహనం (స్థిరత్వం)**
5. **వినయం (గొప్పతనం)**

ఇదే జీవన విద్య. అంటే మూడు ముక్కల్లో చెప్పాలంటే:

- **అల్లాహ్ తో సంబంధం**
- **కుటుంబంతో సంబంధం**
- **సమాజంతో సంబంధం**

ఇదే కదా ప్రపంచం, ప్రాపంచిక జీవితం. అంటే పూర్తి జీవితం దీంట్లో ఇమిడిపోయింది. ఈ విధంగా జీవితం గడిపితే ప్రపంచంలో, సమాజంలో, కుటుంబంలో, స్నేహితుల్లో, బంధువుల్లో అన్ని చోట్ల, అన్ని ప్రాంతాల్లో, అన్ని సమయాల్లో శాంతి ఉంటుంది, న్యాయం ఉంటుంది, భద్రత ఉంటుంది, సమానత్వం ఉంటుంది, హాయిగా జీవితం గడుపుతుంది.

అల్లాహ్ తో సంబంధం ఎలా ఉండాలి, కుటుంబంతో సంబంధం ఎలా ఉండాలి, సమాజంతో సంబంధం ఎలా ఉండాలి. ఇదే ఈ ఉపదేశాలకి సారాంశం, ఇదే జీవన విద్య.

అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా మనందరికీ ఈ విలువలను మన కుటుంబాల్లో ఈ విధంగా అమలు చేసి జీవించే సద్బుద్ధిని అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా మనందరికీ ప్రసాదించు గాక. లుఖ్మాన్ అలైహిస్సలాం కు ఇచ్చిన హిక్మత్ తో హిక్మత్ లో మాకు భాగం ఇవ్వు, ప్రసాదించు గాక. మన పిల్లలను సాలిహీన్లుగా చేయు గాక. మన జీవితాలను ఖురాన్ తో అలంకరించు గాక. ఆమీన్ యా రబ్బిల్ ఆలమీన్.

اللَّهُمَّ اغْفِرْ لِلْمُؤْمِنِينَ وَالْمُؤْمِنَاتِ وَالْمُسْلِمِينَ وَالْمُسْلِمَاتِ الأَحْيَاءِ مِنْهُمْ وَالأَمْوَاتِ ، اللَّهُمَّ أَصْلِحْ شَبَابَ الْمُسْلِمِينَ وَارْزُقْنَا التَّوْحِيدَ الْخَالِصَ ، وَأَعِنَّا عَلَى إِقَامَةِ الصَّلاةِ وَاجْعَلْنَا مِنَ الصَّابِرِينَ الْمُتَوَاضِعِينَ ، آمِين يَا رَبَّ الْعَالَمِينَ.

వస్సలాము అలైకుం వ రహ్మతుల్లాహి వ బరకాతుహు.

—

ఈ పోస్ట్ లింక్ :

https://teluguislam.net/?p=46052